క్లుప్తంగా

అత్తలూరు ఎంపీటీసీ రోశమ్మ మృతి

అమరావతి: మండలంలోని అత్తలూరు ఎంపీటీసీ బంకా రోశమ్మ(59)కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. గతేడాది సెప్టెంబరులో మండల పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అత్తలూరు ఎంపీటీసీ అభ్యర్థిగా బంకా రోశమ్మ పోటీ చేసి విజయం సాధించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు ఆమె మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు.

దుప్పట్లు, దోమతెరలు పంపిణీ



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు బుడగ జంగాల కాలనీలో జన చైతన్య సమితి ఆధ్వార్యాన ఎన్నారై బాలినేని సీతారామకృష్ణ, గుడిపూడి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వీరపనేని రమేష్ సహకారంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు, దోమ తెరలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నారై సీతారామకృష్ణరాజు, హెచ్ఎం రమేష్ మాట్లాడుతూ చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపించాలని, సంచార విధానాన్ని మాని పిల్లలను చదివించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి నిర్వాహకులు దాసరి విజయబాబు, కో–ఆర్డినేటర్ వి.అనిల్ కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.

చదువులో రాణించాలి



అచ్చంపేట: సేవా సంస్థల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని ఎంఈవో వి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఇద్దరు నిరుపేద బీటెక్ విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం అచ్చంపేటలో లాప్‌టాప్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న రవి విహితకు ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40వేల విలువ చేసే లాప్‌టాప్, ఫీజు కోసం రూ.60వేలు ఇస్తున్నట్లు స్నేహ హస్తాలు కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తెలిపారు. గుంటూరు ఆర్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదవే పాకాలపాటి శృతి అనే విద్యార్థికి లాప్‌టాప్, కాలేజీ ఫీజు నిమిత్తం రూ.45వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో చదువులు ఆగిపోకూడదన్న లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తుందని కరిముల్లా బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుమ్మా శౌర్రెడ్డి, స్నేహ హస్తాలు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్యం

దాక్టర్ ప్రవీణ్‌రెడ్డి



అంగన్‌వాడీ స్కూల్‌లో చిన్నారులను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాన్ని దగ్గర చేయటమే ప్రభుత్వం యొక్క లక్ష్యమని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కేవీ ప్రవీణ్‌రెడ్డి, నాగిరెడ్డిలు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇంటింటికి ప్రభుత్వ వైద్య కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి వైద్యాన్ని అందించి ప్రజలకు వైద్య సదుపాయాలను అందించడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. గ్రామంలో ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం పొందిన గృహాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. గ్రామంలో 330 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఏడుకొండలు, శౌరీలు, సురేశ్‌కుమార్, ఏఎన్ఎంలు రమణకుమారి, భారతి, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో 'నవరత్నాల' వెలుగు

- మంచి జరిగిందని భావిస్తే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి 16వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



16వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వడ్డవల్లి 15వ సచివాలయం పరిధిలోని 16 వ వార్డులో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించి లబ్ధి వివరాలు ముద్రించిన కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి కోట్ల రూపాయల జమ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

గత మూడేళ్లలో 95 శాతం పైగా హామీలను అమలు చేశామని, మంచి జరిగిందని భావిస్తే మీరు ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని గత మూడు ఏళ్లలో ఈ సచివాలయం పరిధిలో రూ.11.32 కోట్ల నిధులు మంజూరయ్యా యన్నారు. వాటిలో సంక్షేమ పథకాలకు రూ.10.11 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.1.21 కోట్లు ఖర్చు చేశామని ఆయన వివరించారు.

సంక్షేమానికి రూ.10.11 కోట్ల నిధులు ...

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఈ సచివాలయం పరిధిలో రైతు భరోసా ద్వారా 317 మందికి రూ.10.5 కోట్లు, అమ్మఒడి ద్వారా 492 మందికి రూ.1.25కోట్లు, వైఎస్ఆర్ చేయూత ద్వారా 257మందికి రూ. 8.19లక్షలు, జగనన్న తోడు ద్వారా 45 మందికి రూ .13.5 లక్షలు, వైఎస్ఆర్ ఆసరా ద్వారా 716 మందికి రూ.1.32 కోట్లు, డ్వాక్రా సున్నా వడ్డీ రుణాల ద్వారా 659 మందికి రూ. 2.2 కోట్లు, కాపు నేస్తం ద్వారా 38 మందికి రూ.8.85 లక్షలు, వాహన మిత్ర ద్వారా 9 మందికి రూ.2.3 లక్షలు, విద్యా దీవెన ద్వారా 318 మందికి రూ.75.63 లక్షలు, వసతి దీవెన ద్వారా 180 మందికి రూ. 22.7 లక్షలు, వైఎస్ఆర్ పెన్షన్ కానుక ద్వారా 567 మందికి రూ.4.4కోట్లు, వైఎస్ఆర్ ఈబీసీ ద్వారా 24 మందికి రూ. 3.6 లక్షలు, జగనన్నచేదోడు ద్వారా 12 మందికి రూ.2.1 లక్షలు, రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ద్వారా ఒకరికి రూ.7200, వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా ద్వారా 25 మందికి రూ.1.70 లక్షలు, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా 78 మందికి రూ.24.59 లక్షలు, వైఎస్ఆర్ భీమా ద్వారా 8 మందికి రూ.13.90లక్షలు, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు(రైతులకు) 54 మందికి రూ.16. 66 లక్షలు, వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా ద్వారా 8 మందికి రూ . 13.90 లక్షలు అందించామన్నారు.

రూ . 1.21 కోట్లు తో అభివృద్ధి పనులు ...

14 వ ఆర్థిక సంవత్సరం నిధులతో సీసీ రోడ్డు పనులకు గాను రూ.13.6 లక్షలు , 15 వ ఆర్థిక సంవత్సరం నిధులతో సీసీ డ్రైన్స్ నిర్మాణానికి గాను రూ. 3.4 లక్షలు, సాధారణ నిధులు నుంచీ సీసీ డ్రైన్స్ నిర్మాణానికి గాను రూ. 8.9 లక్షలు, సాధారణ నిధులు నుంచీ సీసీ రోడ్ల కొరకు రూ. 37.3 లక్షలు నిధులతో అభివృద్ధి పనులు చేయించామన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబ శివరావు, కమిషనర్ కొలిమి షమ్మి, నాయకులు అచ్యుత శివ ప్రసాద్, నందిగం ఆదాం, చిలుకా రమణయ్య, ఇసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాజారపు సాంబయ్య, పుట్టా వెంకటేశ్వర్లు, బొడ్డు కోటి, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, ఎస్ఎమ్ యూనస్, బండి మల్లికార్జున రెడ్డి, తుమ్మల వెంకటేశ్వరరావు, షేక్ గని, బచ్చు. మనోహర్, సహరా మౌలాలి, ఇతర కౌన్సిలర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ వెలుగులు నింపడమే సీఎం జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- నాగవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



నాగవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

నాగవరం(క్రోసూరు): పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండలంలోని నాగవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలు పొందిన లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ.. ప్రజలకు మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో అందించిన సాయాన్ని వివరించేందుకు ప్రతి గడపకు వెళ్తున్నామన్నారు. అంతే బాధ్యతగా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని వివరించారు.

నాగవరంలో రూ.11.33 కోట్ల సంక్షేమ వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో నాగవరం గ్రామంలో రూ.11.33 కోట్లు సంక్షేమ సాయం ప్రజలకు అందించటం జరిగిందని ఎమ్మెల్యే శంకరరావు తెలిపారు. గ్రామంలో 113 మందికి రూ.3.50 కోట్లతో ఇళ్ల స్థలాలు మంజూరైనట్లు వెల్లడించారు. జగనన్న అమ్మవడి ద్వారా 290 మందికి రూ.1.06 కోట్లు , వైఎస్సార్ రైతు భరోసా ద్వారా 529 మంది రైతులకు రూ.1.78 కోట్లు.. ఇలా పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించినట్లు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ మస్తాన్‌వలి, షేక్ సుభాని, సానికొమ్ము సహదేవరెడ్డి, ఆవుల సాయి, తన్నీరు తాతారావు, వడ్లమూడి దేవదానం, పార్టీ గ్రామ అధ్యక్షుడు అంకమరావు, షేక్ బాజి, షేక్ బాబు, ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, జడ్పీటీసీ షేక్ జమీలా, షేక్ గఫూర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, మేదర రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

వటవృక్షాంతర్గత వేంకటేశ్వరుడి కల్యాణం..

- స్వామి దర్శనం సర్వపాప హరణం
- మల్లాదిలో ఘనంగా 46వ వార్సికోత్సవ వేడుకలు
- 22న స్వామివారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



కళ్యాణోత్సవ ఉత్సవ మూర్తులు



వెంకటేశ్వరస్వామి దేవస్థానం

అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రం.. అమరావతి నుంచి క్రోసూరు మార్గంలోని మల్లాది గ్రామంలో వేంచేసియున్న శ్రీ వటవృక్షాంతర్గత(మర్రిచెట్టులో వెలసిన) శ్రీ వేంకటేశ్వరుడు నాలుగు దశాబ్దాలుగా భక్తుల పాలిట కల్పవృక్షంగా నిత్యం పూజలందుకుంటున్నారు. స్వయంభుగా శ్రీ వటవృక్షాంతర్గత వెంకటేశ్వరస్వామి గా అవతరించిన సుదినం నుంచి ఏటా.. జనవరి 22న స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువుగా నిర్వహిస్తున్నారు. సంతానం లేనివారు నియమానుసారం స్వామిని సేవిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని.. భక్తుల నమ్మకం.స్వామి దర్శనంతో.. దీర్ఘకాలిక వ్యాధులు, ఆర్థిక ఇబ్బందులు తొలగి మానసిక ప్రశాంతతతో భక్తులు జీవిస్తున్నారని చెప్పటానికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. సత్తెనపల్లికి చెందిన ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యేలూరి మంగాయమ్మ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. చెట్టు పక్కనే పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి సుందరమైన ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది 46వ వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు యేలూరి సీతారామయ్య, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు సిద్ధం..

ఈ సందర్భంగా మంగళవారం ఆలయ అర్చకుడు వినుకొండ శ్రీనివాసాచార్యులు కల్యాణోత్సవ కార్యక్రమాలను వివరించారు.. ఈ నెల 21న స్వామి వారికి నక్షత్ర కలశ స్నపన, స్వామి వారినిపెండ్లి కుమారుడిని చేయడం జరుగుతుందన్నారు. కల్యాణోత్సవంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 22న ఉదయం అమరావతి వాసవీ మహిళా మండలి వారిచే విష్ణు సహస్రనామ పారాయణంతో స్వామి వారికి తులసీదళ సేవ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పరుచూరి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. కల్యాణోత్సవ అనంతరం భక్తులందరికి అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు స్వామి వారిని పెద శేష వాహనంపై వైభవంగా గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు. తాత్కాలిక క్యూలైన్‌లు, ఉచిత ప్రసాదం, తాగునీరు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఈ కల్యాణోత్సవ వేడుకల్లో భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా మాగులూరి



ఎమ్మెల్యే శంకరరావును సత్కరిస్తున్న మాగులూరి అనిల్‌కుమార్

పెదకూరపాడు : సచివాలయాల మండల కన్వీనర్‌గా హుస్సేన్ నగర్ గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మాగులూరి అనిల్ కుమార్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకర రావు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి, జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు కంకణాల శివాజీ, మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరుకు.. సయ్యద్ అబ్దుల్ రహీం

క్రోసూరు: మండల సచివాలయ కన్వీనర్‌గా తనను నియమించిన ఎమ్మెల్యే నంబూరుశంకర రావుకు సయ్యద్ అబ్దుల్ రహీం మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వలంటీర్లతో కలిసి మరింత కృషి చేస్తానన్నారు. వలంటీర్లకు, ప్రజలకు వారధిగా ఉండి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు.

హనుమత్ మాల దీక్ష ప్రారంభం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమత్‌దీక్షా ధారణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. మండల దీక్షలో భాగంగా భక్తులు దీక్ష చేపట్టారు. సుమారు 60 మందికి పైగా భక్తులు హనుమత్ మాల ధరించారు.

ఫోన్‌ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపు

నకరికల్లు: విద్యుత్ బిల్లులు చెల్లించే వినియోగదారులు ఫోన్‌లోని యాప్స్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని ఆశాఖ ఏఈ రూఫస్ డానియేల్ మంగళవారం తెలిపారు. ఫోన్‌పే, పేటీఎం, విద్యుత్‌శాఖ అనుసంధానమైన కన్స్యూమర్ యాప్‌లలో బిల్లులు చెల్లించవచ్చన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించడంతో పాటు అపరాధరుసుం లేకుండా ఉంటుందన్నారు.

నేడు పోలీసు కానిస్టేబుల్ మోడల్ పరీక్ష

క్రోసూరు: ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా జరిగే పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు బుధవారం నరసరావుపేట వాసవీ డిగ్రీకళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డీవైఎఫ్ఐ) పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. పరీక్ష ఫీజు రూ.100లని తెలిపారు. అభ్యర్థులు ముందుగా పరీక్ష కేంద్రంలో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కోతుల పట్టివేత

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని పలు వార్డుల్లో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ ఈవి రమణబాబు ఆధ్వర్యంలో మంగళవారం కోతులను పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టారు. గత మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు పట్టణంలోని ఆయా వార్డుల్లో కోతుల బెడద ఎక్కువగా ఉందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయడంతో మున్సిపల్ రమణ బాబు కోతులు పట్టే వారిని పిలిపించి యుద్ధ ప్రాతిపదికన నాలుగు రోజుల నుంచి కోతులు పట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు 13, 14, 15, 16 వార్డుల్లో సుమారు 200 ల కోతులను పట్టుకుని బోనుల్లో వేసినట్లు తెలిపారు. ఈ కోతులను సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని తెలిపారు. గతంలో కుక్కలను పట్టివేసి నల్లమల్ల అడవిలో వదలడం జరిగిందన్నారు. త్వరలో రోడ్ల పై అడ్డంగా తిరగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆవుల యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు.

వైభవంగా పునీత అంతోని చర్చి తిరునాళ్ల



ప్రత్యేక పూజలో పాల్గొన్న పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలోని శ్రీపునీత అంతోనివారి చర్చి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సుమారు 125 సంవత్సరాల పైగా చరిత్ర కలది. పలు ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులంతా తిరునాళ్లకు సొంత గ్రామానికి వచ్చి ఘనంగా జరుపుకుంటారు. తిరునాళ్లలో భాగంగా ఉదయం 5గంటలకు చర్చిలో ఆలయ విచారణ గురువులు వై.థామస్ ఆధ్వర్యంలో దివ్యపూజ నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం సమిష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. నల్లపాడు విచారణ గురువు కె.ఇన్నారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ గురువు వై.థామస్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం నుంచి కొవ్వొత్తుల సమర్పణ చేశారు. సాయంత్రం 4 గంటలకు బాణాసంచా కాలుస్తూ గ్రామంలో తేరు ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు చర్చిలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

క్షతగాత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న హరి మిత్రమండలి సభ్యులు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు హరి మిత్రమండలి ముందుకు వచ్చింది. పట్టణంలోని నాగార్జున నగర్‌కు చెందిన మోహన్‌దాస్ చంద్రబాబు కల్లం స్పిన్నింగ్ మిల్లు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ జీవనం వెళ్ళదీస్తున్నాడు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన మోహన్‌దాస్ చంద్రబాబుకు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం క్షతగాత్రుడి కుమార్తె హారిక ద్వారా తెలుసుకున్న హరి మిత్రమండలి మంగళవారం రూ. 10 వేలు చెక్కును అందించారు. కార్యక్రమంలో హరి మిత్రమండలి అధ్యక్షుడు సదనం హరి, సభ్యులు తోట స్వామి, యాసారపు బాబు, మల్లీ, శ్రీరామ్, తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

సత్తెనపల్లి: పట్టణ ప్రాంతాల్లో పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 200 పని దినాలు కల్పించాలని, రూ.600 కూలీ నిర్ణయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు కూలీలకు అనేక రకాల ఇబ్బందులు తెచ్చిపెట్టాయన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ కార్మికులు వలస పక్షుల్లా అయిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో పట్టణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. తమిళనాడు, కేరళ, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పట్టణ ఉపాధి హామీ పథకం అమలవుతున్నాయని అలాగే మన రాష్ట్రంలో కూడా పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలకు సత్తెనపల్లిలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళ, బుధవారాల్లో శిక్షణా తరగతుల నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దళితుల, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేపడతామన్నారు. అందులో భాగం గానే ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు పల్నాడు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివ నాగరాణి, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేడ వెంకటేశ్వర్లు, జమండ్లమూడి భగత్, కొమ్ముల నాగేశ్వరరావులు ఉన్నారు.

కల్యాణ మండపాన్ని త్వరలో పూర్తి చేస్తాం

మంత్రి అంబటి రాంబాబు




అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: కల్యాణ మండపాన్ని త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని దేవరంపాడు దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం, అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ వచ్చే తిరుణాళ్లకల్లా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ నుంచి మంజూరైన రూ . 99 లక్షలతో మండపానికి ఇరువైపుల భక్తుల సౌకర్యార్థం మెట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మంజూరైన నిధులతో రూమ్‌లు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. దాతలు ముందుకు వచ్చి దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, జీడీసీఎంఎస్ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, సర్పంచులు సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, నకరికల్లు మండల కన్వీనర్ భవనం రాఘవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

వెల్దుర్తి: మాచర్ల నియోజక వర్గ పరిధిలోని ఎపిసిపిడిసిఎల్ విద్యుత్ వినియోగదారులు ఈ నెల 19, 20, 21 తేదీల్లో పట్టణంలో ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బహిరంగ వినియోగదారుల అభిప్రాయాలు సేకరించనున్నట్లు మంగళవారం విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిసిపిడిసిఎల్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటైల్ ధరల పై విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆదాయ అవసరములు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొ న్నారు. ఈ అవకాశాన్ని మాచర్ల పట్టణంలో స్థానిక విద్యుత్ వినియోగదారులు తమ అభిప్రాయాలను కార్యక్రమంలో పాల్గొని తెలుపవలసిందిగా కోరారు. 10-30 గం॥ల నుంచి మ॥ 1గం॥ వరకు, మ॥ 2గం॥ల నుంచి 4:30గం॥ల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పిడుగురాళ్ల: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని పట్టణ సీఐ ఎం. మదుసూధన్‌రావు తెలిపారు. పట్టణంలోని కళ్లం టౌన్ షిప్ సమీపంలోని పొలాలకు వెళ్లే కరాలపాడు డొంక సమీపంలో దుర్వాసన వస్తుండడంతో కొంత మంది రైతులు వెళ్లి చూసే సరికి ఇక్కడ గుర్తు తెలియని మృతదేహం ఉబ్బి ఉంది. సమాచారాన్ని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మృతదేహం సుమారు 3, 4 రోజుల క్రితం చనిపోయి ఉంటాడని తెలిపారు. మృతుని నల్లరంగు ఫ్యాంట్, తెల్లరంగు చొక్కా ధరించి ఉన్నాడు. సుమారు 35, నుంచి 40 సంవత్సరాల లోపు ఉంటుందని పట్టణ సీఐ తెలిపారు. అయితే మెడలో టవల్ కూడా ఉందని తెలిపారు. మృతుని వివరాలు, మృతికి సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ మధుసూధన్‌రావు తెలియజేశారు.